# సాక్షి
## ఖమ్మం

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024






### పొంగి పొర్లిన బుగ్గవాగు
బుగ్గవాగుకు భారీగా వరద రావడంతో కారేపల్లి మండలం పేరుపల్లి వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి నీరు చేరింది.
8లో



### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా ప్రత్యేక అధికారి వీ.పీ.గౌతమ్ ఆదేశించారు.
8లో

గరిష్టం / కనిష్టం
28° / 23°

### వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసే అవకాశముంది. మధ్యాహ్నం వేళ సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది.

## న్యూస్‌రీల్

### రైళ్ల రద్దు, దారి మళ్లింపు
ఖమ్మం రాపర్తినగర్: వరదల కారణంగా ఖమ్మం మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను గురువారం కూడా రద్దు చేశారు. ఈమేరకు నాందేడ్ – విశాఖపట్నం, రెండు వైపులా శాతవాహనతో పాటు ఇంకొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా రద్దయ్యాయని కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ. జాఫర్ తెలిపారు. అలాగే, మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నందున ప్రయాణికులు గమనించాలని సూచించారు.

### వాగులు, చెరువులు చూసేందుకు వెళ్లొద్దు
ఖమ్మంక్రైం: జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు, చెరువుల ప్రవాహాన్ని చూసేందుకు ప్రజలెవరు బయటకు రావొద్దని సీపీ సునీల్‌దత్ విజ్ఞప్తి చేశారు. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద వస్తుండగా చూసేందుకు ప్రజలు భారీగా వెళ్తున్నారని తెలిపారు. అయితే, సెల్ఫీలు దిగే ప్రయత్నంలో ప్రమాదం బారిన పడే అవకాశమున్నందున ప్రజలు ఎవరూ వెళ్లొద్దని సీపీ ఓ ప్రకటనలో సూచించారు.

### సత్తుపల్లి, వైరాల్లో యథావిధిగా పాఠశాలలు
ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో వరద ముప్పు లేనందున ఆయా ప్రాంతాల్లోని విద్యాసంస్థలను కొనసాగించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో సూచించారు. ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో మాత్రమే స్కూళ్లకు ఈనెల 6వరకు సెలవులు ప్రకటించామని.. ఆపై 7న వినాయకచవితి, 8న ఆదివారం కావడంతో 9వ తేదీ నుంచి విద్యాసంస్థలు తెరుచుకుంటాయని తెలిపారు. ఈ విషయాన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

### ఆర్టీసీకి రూ.1.01 కోట్లు నష్టం
ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలతో వచ్చిన వరదల కారణంగా ఆర్టీసీ సంస్థ భారీగా ఆదాయాన్ని కోల్పోయింది. మూడు రోజులుగా పలు రూట్లలో అనేక సర్వీసులు రద్దు చేయడంతో ఆదాయానికి గండి పడింది. ఖమ్మం రీజియన్‌లో ఈనెల 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు పలు రూట్లలో సర్వీసులు రద్దయ్యాయి. ఈ మూడు రోజుల్లో 1,74,532 కి.మీ. మేర సర్వీసులు రద్దుకాగా, రూ.1,01,21,111 ఆదాయాన్ని కోల్పోయింది. ఈనెల 1న రీజియన్‌లో 263 బస్సులు రద్దు కావడంతో రూ.74,63,379, 2వ తేదీన 64 బస్సులు రద్దు కాగా రూ.17,56,401, 3న 24 సర్వీసులు రద్దు కాగా రూ.7,01,331 నష్టపోయినట్లు అధికారులు వెల్లడించారు.

### డీసీసీబీ సీఈఓగా వసంతరావు


వసంతరావు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ)గా జనరల్ మేనేజర్ వి.వసంతరావుకు బుధవారం బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు సీఈఓగా ఉన్న అబీద్ ఉర్ రెహమాన్‌ను రుణమాఫీ, ఇతర అంశాలపై వచ్చిన ఆరోపణలతో సస్పెండ్ అయిన విషయం విదితమే. దీంతో ప్రస్తుతం ప్రధాన కార్యాలయంలో జీఎంగా ఉన్న వసంతరావుకు చైర్మన్ వెంకటేశ్వరరావు సీఈఓగా బాధ్యతలు అప్పగించడంతో ఆయన విధుల్లో చేరారు. గతంలో కూడా ఆయన జీఎంగా విధులు నిర్వర్తిస్తూనే సీఈఓగా కొన్నాళ్లు పనిచేశారు.

# మళ్లీ వరద భయం

- మున్నేటికి ఎగువన వర్షాలతో పరీవాహక ప్రాంతంలో ఆందోళన
- వరద వస్తే తమ పరిస్థితి ఏమిటంటున్న బాధితులు
- మున్నేరు శాంతించినా ఎప్పుడు పెరుగుతుందో తెలియని పరిస్థితి
- 'కాళరాత్రి' గుర్తుకొస్తే బాధితుల్లో ఆవేదన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మున్నేరు ముంపు లోతట్టు ప్రాంతాల్లోని ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల బాధితులకు మళ్లీ వరద భయం పట్టుకుంది. బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పలుసార్లు ఆగి ఆగి వర్షం పడింది. దీంతో ప్రభుత్వ సహాయక కార్యక్రమాలు, బాధితులు తమ ఇళ్లను శుభ్రం చేసుకునే పనులకు ఆటంకం కలిగింది. ఎగువన ఉన్న మహబూబాబాద్ జిల్లాలో మళ్లీ వర్షాలు పడుతున్నాయన్న సమాచారంతో ముంపు బాధితులంతా ఈనెల 1న తమను ముంచిన కాళరాత్రిని గుర్తు చేసుకుంటూ భయాందోళనలో ఉన్నారు.

**వరద వేగం తీవ్రతతో..**
మున్నేటి వరద వేగం గతంతో పోలిస్తే ఎక్కువగా పెరిగింది. మున్నేటిలో ఇసుక తవ్వడం, బఫర్‌జోన్‌లో అక్రమ కట్టడాలు కారణమైతే.. ఎగువ నుంచి వస్తున్న వరదను నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేయకపోవడం భారీ విపత్తుకు మరో కారణంగా కనిపిస్తోంది. గత నెల 31న రాత్రి 9 గంటల సమయాన 11 అడుగులుగా ఉన్న మున్నేటి ప్రవాహం.. ఈనెల 1న ఉదయం 11 గంటల వరకు కేవలం 14 గంటల్లోనే 25.9 అడుగులకు చేరింది. ఇంత తక్కువ సమయంలో వరద ఎక్కువగా రావడం, ముందస్తు సమాచారం లేకపోవడంతోనే తాము నష్టపోయామంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మళ్లీ మహబూబాబాద్ జిల్లాలో వరద వచ్చి ఆకేరు ఉధృత ప్రవాహం దాలిస్తే మున్నేరుకు సైతం పోటెత్తుతుందని బాధితులు బిక్కుబిక్కుమంటున్నారు. వర్షాలు ఇంకా కొన్ని రోజుల పాటు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో లోతట్టు ప్రాంత ప్రజలకు మళ్లీ వరద భయం పట్టుకుంది.


ప్రశాంతంగా సాగుతున్న మున్నేరు ప్రవాహం

**శాంతించినట్లు కనిపిస్తున్నా..**
ప్రస్తుతం మున్నేరు శాంతించినట్లుగా ఉంది. బుధవారం రాత్రి ఏడు గంటలకు 12.5 అడుగులుగా వరద ప్రభావం ఉంది. అయితే అడపా దడపా వర్షం పడుతుండటంతో ఓ వైపు అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. వర్షంతోనే సహాయక చర్యలు ఆలస్యమవుతున్నట్లు యంత్రాంగం చెబుతోంది. శాంతంగా ఉన్న మున్నేరు మళ్లీ ఉగ్రరూపం దాలిస్తే తమ పరిస్థితి ఏమిటని బాధితులు వాపోతున్నారు. అయితే వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈనెల 8వరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సెలవులు ప్రకటించారు.

**అది ఓ కాళరాత్రి..**

మున్నేరు పరీవాహక ప్రాంతంలో గత నెల 31న ప్రారంభమైన వరద ఈనెల 1న మధ్యాహ్నానికి ముంచెత్తింది. అయితే అర్ధరాత్రి మున్నేరు లోతట్టు ప్రాంతాన్ని మొత్తం వరద చుట్టడంతో వేలాదిమంది ఇళ్లపై కప్పులకు చేరుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొందరు వరదలో చిక్కుకున్నారు. ఊహించని రీతిలో వరద ఇళ్లలోకి చేరడంతో బాధితులు భయభ్రాంతులకు గురయ్యారు. నాటి కాళరాత్రిని గుర్తు చేసుకుని బాధితులు 'ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయట పడ్డాం' అని వణికిపోతున్నారు. నాటి పరిస్థితిని తలుచుకుంటూ వారిని వర్షం పడుతున్న ప్రతీసారి మళ్లీ వరద వస్తుందా అనే భయాందోళన వెంటాడుతోంది.

# సర్వే సగం సగమే...

- పూర్తి వివరాలు సేకరించని సిబ్బంది
- ఎంత వరద వచ్చిందో మాత్రమే ఆరా
- సామగ్రి నష్టం నమోదు చేయకపోవడంపై బాధితుల్లో ఆవేదన

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదలతో ముంపునకు గురైన ఇళ్లకు సంబంధించి సర్వే కొనసాగుతోంది. ఖమ్మం నగరంతో పాటు పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండలంలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. అయితే, సర్వేలో సేకరిస్తున్న వివరాలు నామమాత్రంగానే ఉన్నాయని.. పూర్తినష్టాన్ని నమోదు చేయడం లేదని ముంపు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాంటప్పుడు తామేం సామగ్రి నష్టపోయామో ప్రభుత్వానికి ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు.

**212 మందితో సర్వే..**
ఖమ్మం నగరంలో 112 మంది, ఖమ్మంరూరల్ మండలంలో 100 మంది సిబ్బందిని సర్వేకు కేటాయించారు. వీరు వరద చేరిన వీధుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి ఎన్ని కుటుంబాలు ఉన్నాయి. వారి వివరాలు.. ఇంట్లోకి నీరు ఎంత మేర వచ్చిందనే వివరాలు సేకరిస్తున్నారు. ఇంటి ఫొటో కూడా తీస్తున్నారు. ఖమ్మం నగరంలో మంగళవారం, రూరల్ మండలంలో బుధవారం నుండి సర్వే మొదలైంది. ఇప్పటివరకు నగరంలో 4,229, రూరల్ మండలంలో వెయ్యి ఇళ్లను సర్వే చేసినట్లు తెలుస్తోంది.

**ఏమేం అడుగుతున్నారు...**
సర్వేలో భాగంగా వరద ప్రాంతం పేరు, కుటుంబ యజమాని పేరు, తండ్రి/భర్త పేరు, ఇంటి నంబర్, ఫోన్ నంబర్, సొంతమా, అద్దె ఇల్లా అనే వివరాలే కాక ఇంటి చుట్టూ నీళ్లు చేరాయా, ప్రహరీ ఆవరణలోకి వచ్చాయా, గదుల్లోకి చేరాయా అని ఆరా తీస్తున్నారు. అలాగే, వరదతో ఇంటికి భారీ నష్టం జరిగిందా అని నమోదు చేసి ఫొటో తీస్తున్నారు. ఆపై బ్యాంక్ పేరు, బ్రాంచ్, అకౌంట్ నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, సెల్ఫ్ అకౌంటా లేక జాయింట్ అకౌంటా అనే వివరాలు సేకరిస్తున్నారు. ఇక రూరల్ మండలంలో పోలీసు సిబ్బంది చేస్తున్న సర్వే ఫామ్‌లో కుటుంబ యజమాని పేరు, ప్రాంతం, ఫోన్ నంబర్, రిమార్క్ అని మాత్రం ఉంది. పూర్తి వివరాలు సేకరించకపోగా.. నగరంలోని పలు ప్రాంతాల్లో బురద ఉందంటూ సర్వే సిబ్బంది రావడం లేదని తెలుస్తోంది.

**రూ.లక్షల్లో నష్టం**
మున్నేరు వరదతో కొందరు ఇళ్లను పూర్తిగా కోల్పోతే.. ఇంకొందరి ఇంటి గోడలు, దర్వాజలు కూలి కనిపిస్తున్నాయి. ఇక మరికొందరి ఇళ్లల్లో వరద చేరిన కారణంగా ఏ వస్తువు ఉపయోగించుకునేందుకు వీలు లేకుండా పోయాయి. దీంతో వాటన్నింటినీ పారిశుద్ధ్య కార్మికుల వాహనాల్లో వేస్తున్నారు. ఇలా ఒక్కో ఇంట్లో రూ.లక్ష మొదలు రూ.10 లక్షల విలువైన సామగ్రి కోల్పోగా ఈ వివరాలను సర్వేలో సేకరించకపోవడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఖమ్మంరూరల్ మండలంలో సర్వే చేస్తున్న పోలీసు సిబ్బంది


సర్వేలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

**కష్టార్జితం పోయింది..**



నా భర్త అటెండర్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యాక 2004లో ఇల్లు నిర్మించుకున్నాం. ఇంటి సన్ సైడ్‌కు అనుకుని వరద ప్రవహించడంతో ఇంట్లోకి కూడా చేరి సామగ్రి పాడయ్యాయి. మా ఇంట్లో నివాసముండే మూడు కుటుంబాల్లో అంతా కోల్పోయాం. కానీ ఉద్యోగులు ఏం నష్టపోయామో నమోదు చేయలేదు. – **కాంపాటి జమలమ్మ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ**

**మొత్తం కోల్పోయా..**



ఎప్పుడూ రాని వరదను చూశాం. వరద ఇంటిపై పడడంతో కట్టుబట్టలు తప్ప సామగ్రి, ఇతర వస్తువులన్నీ కోల్పోయాం. అధికారులు సర్వే కోసం వచ్చి నీళ్లు ఎక్కడ వరకు వచ్చాయో అడిగి పేరు, ఫోన్, ఖాతా నంబర్ మాత్రమే తీసుకున్నారు. మా ఇంట్లో కోల్పోయిన వస్తువుల వివరాలు నమోదు చేయలేదు. – **ముదిగొండ ప్రభాకర్, పంపింగ్‌వెల్ రోడ్డు**

**వరద వివరాలనే సేకరించారు..**



కొత్తగా ఇంట్లో ఇటీవలే గృహ ప్రవేశం చేశాం. వరదతో ఇంటి గోడ కూలి వరద చేరగా సామగ్రి తడిసి పనికిరాకుండా పోయ్యాయి. టీవీ, వాషింగ్‌మిషన్, ఫ్రిడ్జ్, ఇతర సామాన్లు అన్నీ తడిశాయి. సర్వే కోసం సిబ్బందికి ఈ విషయాలు చెబితే పట్టించుకోలేదు. పేరు, ఫోన్, ఖాతా నంబర్ మాత్రమే తీసుకున్నారు. – **రాళ్లబండి రాజబాబు–విజయ, పెద్దమ్మతల్లి గుడి రోడ్డు**

# డీసీసీబీలో మరో ఇద్దరిపై వేటు

ఇద్దరు జీఎంల సస్పెన్షన్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో మరో ఇద్దరు ఉన్నతాధికారులు సస్పెండ్ అయ్యారు. పలు అంశాల్లో సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరించారని పేర్కొంటూ ఇద్దరు జనరల్ మేనేజర్లు ఏ.పద్మావతి, కె.నర్మదను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్ పి.ఉదయ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రైతుబీమా ప్రీమియం వ్యవహారంలో పద్మావతి, బదిలీలు, ఇంక్రిమెంట్ల చెల్లింపులు, ఇతర అంశాల్లో నర్మదను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో పద్మావతి ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తుండగా, నర్మద ఇటీవలే నల్లగొండ డీసీసీబీకి బదిలీ అయ్యారు. ఇప్పటికే రుణమాఫీలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్‌ను సస్పెండ్ చేయగా.. మరో ఇద్దరిని సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

**ఏమిటీ కారణం**
బ్యాంకు పరిధిలో రైతుబీమా పాలసీని రూ.50 వేల నుంచి రూ.2లక్షలకు పెంచారు. ప్రీమియంపై టెండర్లు ప్రకటించగా ఎస్‌బీఐ లైఫ్ దక్కించుకుంది. సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, జీఎం పద్మావతి నేతృత్వాన ప్రక్రియ నిర్వహించగా పారదర్శకత లోపించిందని, పీఏసీఎస్‌ల నుంచి తీర్మానాలు తీసుకోలేదనే కారణంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఇక డీసీసీబీ అధికారులు, ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, ఇతర ప్రోత్సాహకాలు, ఆడిట్ చార్జీల పెంపు, బదిలీలు వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలపై నర్మదపై వేటు పడింది. చైర్మన్, పాలకవర్గం ప్రమేయం లేకుండా నిర్ణయాలు అమలుచేయడంతోనే సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

# వందేళ్లలో ఇవే భారీ వరదలు

- బాధితులకు అండగా ప్రభుత్వం.
- తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

కూసుమంచి/నేలకొండపల్లి/కారేపల్లి: రాష్ట్రంలో గత వందేళ్లలో ఇంతటి భారీ వర్షాలు, వరదలను చూడలేదని.. ఫలితంగా వేలాది మంది నిరాశ్రులయ్యారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి బాధితులను ఓదార్చారు. దెబ్బతిన్న పంట పొలాలు, ఇండ్లు, రహదారుల సర్వే త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం, అధికార యంత్రాంగం అప్రమత్తం కావడంతో పెను ముప్పు తప్పిందని అన్నారు. అయినా వేలాదిమంది నిరాశ్రులయ్యారని.. రాష్ట్రంలో రూ.5,500 కోట్ల మేర నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. వరదతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తుండగా.. నష్టపోయిన ప్రతీ కుటుంబానికి పరిహారం ఇస్తామని వెల్లడించారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడమే కాక తడిసిన బియ్యం తీసుకుని సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. ఆతర్వాత నాయకన్‌గూడెంలో వరదతో మృతి చెందిన షేక్ యాకూబ్ – సైదాబీ కుమారులకు రూ.10లక్షల పరిహారం చెక్కులను మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందజేశారు.

**అశ్విని కుటుంబానికి పరిహారం**
ఆకేరు వాగులో గల్లంతై కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ మృతి చెందిన విషయం విదితమే. వీరి పేరిట రూ.5లక్షల చొప్పున మంజూరైన రూ.10లక్షల చెక్కును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి అందజేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వి.సీతారాములు, రమేష్, భద్రయ్య, బి.నాగరాజు, అంజిని, బొర్రా రాజశేఖర్, పి.మంజుల, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, తలారి చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


కట్టుకాచారాంలో కొట్టుకపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

# బాధితుల ఖాతాల్లో తాత్కాలిక సాయం

- పూర్తిగా దెబ్బతిన్న వాటి స్థానంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్:మున్నేటి వరదతో సర్వస్వం కోల్పోయిన బాధితుల ఖాతాల్లో గురువారం నుంచి రూ.10వేల తాత్కాలిక సాయం జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. వరదలు తగ్గిన 40 గంటల్లోనే పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చామన్నారు. ముంపుతో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అహర్నిశలు పనిచేస్తుండడమే కాక ప్రాణహానీ జరగకుండా పాటుపడిన జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. ప్రతీ డివిజన్‌లో పది మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని, వీటితో పాటు మొబైల్‌టీమ్ ఇంటింటికి వెళ్లికి జ్వర సర్వే నిర్వహిస్తుందన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పి.నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్, అదనపు కలెక్టర్ శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు. తొలుత మంత్రి ఖమ్మం కాల్వొడ్డు, సారధినగర్‌ల్లో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు కమర్తపు మురళి, దీపక్‌చౌదరి, గుత్తా వెంకటేశ్వరరావు, రావూరి సైదుబాబు, యలగొండలస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీవీసీ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు వరద బాధితుల కోసం రూ.2.40లక్షల చెక్కును మంత్రికి అందజేశారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

# బోధన.. సౌకర్యాల కల్పనలో మేటి

- రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా మీటకోటి సింహాచలం
- దాతల చేయూతకు తోడు అధ్యాపకుల సహకారంతో వసతులు
- జిల్లాలో మరో ఇద్దరికి కూడా అవార్డులు

కారేపల్లి/ఖమ్మం సహకారనగర్/కొణిజర్ల: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 14 మంది అధ్యాపకులకు ఇంటర్‌మీడియట్ బోర్డ్ అవార్డులు ప్రకటించింది. వీరిని గురువారం హైదరాబాద్‌లో సత్కరించనున్నారు. కాగా, జాబితాలో నలుగురు ప్రిన్సిపాళ్లు ఉండగా కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్నాళ్లు విధులు నిర్వర్తించి ఇటీవలే ఏన్కూర్‌కు బదిలీ అయిన మీటకోటి సింహాచలం కూడా ఉన్నారు. అలాగే, డిగ్రీ కళాశాలల స్థాయిలో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఓంకార్, స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీలో పెద్దగోపతి జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు భాషా పండిట్ గొట్టెముక్కల వెంకటేశ్వర్లు అవార్డులకు ఎంపికయ్యారు.

**200 నుంచి 400కు పెరిగిన ప్రవేశాలు**
కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 2016లో ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చిన మీటకోటి సింహాచలం ఈ ఏడాది వరకు విధులు నిర్వర్తించారు. ఆయన వచ్చినప్పుడు కళాశాలలో 200 మంది విద్యార్థులు ఉండగా ప్రవేశాల సంఖ్య 400కు పెరిగేలా కృషి చేశారు. కళాశాలలో ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేయడమే కాక ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించేలా పాటుపడ్డారు. కారేపల్లిలో గిరిజన బాలికల వసతి గృహం, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలు అందుబాటులో ఉండడంతో కూసుమంచి, ఖమ్మం రూరల్, కామేపల్లి, గార్ల మండలాల విద్యార్థులు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందారు.


సింహాచలం

**వసతులు భేష్**
కారేపల్లి కళాశాలలో ప్రిన్సిపాల్ సింహాచలం కృషితో వరంగల్ జైలులో ఖైదీలు తయారు చేసిన 56 డ్యూయల్ డెస్కులను దాతల సహకారంతో తెప్పించారు. సింగరేణి ప్రస్తుత సీఎండీ బలరాం సహకారంతో 2020లో కళాశాలలో 'చదువు–ప్రేరణ' పేరిట కార్యక్రమం నిర్వహించారు. అలాగే, 60 డ్యూయల్ డెస్కులు, షెడ్ల నిర్మాణానికి రూ.4.18లక్షలు అందించారు. మాధారం డోలమైట్ మైన్ ద్వారా 48 డ్యూయల్ డెస్కులను సమకూర్చారు. 2019లో కారేపల్లి కళాశాల భవనంలోని అన్ని గదులకు రంగులు వేయించేందుకు అధ్యాపకులు, దాతల నుంచి రూ.1.65లక్షలు సేకరించారు. ఏటా ఆరుగురు పేద విద్యార్థులకు ప్రిన్సిపాల్ సొంత ఖర్చుతో యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. కళాశాలలో నీటి కొరత, మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిసి రూ.35వేలు జమ చేసి బోర్‌వెల్, మరుగుదొడ్ల మరమ్మతులు చేయించారు. ఇక ద్వితీయ సంవత్సరం చదువుతున్న నిరుపేద విద్యార్థి రామగిరి సంపత్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో రూ.1.20లక్షలు సేకరించి మెరుగైన చికిత్స చేయించడంలో ప్రిన్సిపాల్ కీలకంగా వ్యవహరించారు.

**ఉత్తమ అధ్యాపకుడిగా ఓంకార్**


ఓంకార్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.ఓంకార్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. యూనివర్సిటీ స్థాయిలో కేయూ పరిధిలో ఆయన ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాకీరుల్లా తెలిపారు. హన్మకొండ కేడీసీలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఇటీవలే ఖమ్మం వచ్చారు. ఓంకార్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏ.ఎల్.ఎస్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమా సత్యవతి, అధ్యాపకులు అభినందించారు.

**ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వర్లు**


వెంకటేశ్వర్లు

కొణిజర్ల: కొణిజర్ల మండలం పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా పండిట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గొట్టెముక్కల వెంకటేశ్వర్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన వెంకటేశ్వర్లు 2002 డీఎస్సీలో తెలుగు పండిట్‌గా ఎంపికై బోనకల్ మండలం రామాపురంలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం అదే మండలం గోవిందాపురం(ఎల్)లో, ఆపై పాతర్లపాడులో పనిచేశాక ఈ ఏడాది జూన్‌లో పదోన్నతిపై కొణిజర్ల మండలం పెద్దగోపతి వచ్చారు. ఆయన బోధనకే పరిమితం కాకుండా రచయిత, గాయకుడు, యాంకర్, రేడియో ఆర్టిస్టు, సామాజిక సేవా కార్యకర్తగా రాణిస్తూనే పిల్లలను తెలుగు భాషలో నిష్ణాతులుగా తీర్చిదిద్ది భాషపై పట్టు సాధించేలా నాటకాలు వేయించేవారు. ప్రపంచ తెలుగు మహా సభల్లో పాల్గొని తన గళం వినిపించారు. 2015లో చింతకాని మండల స్థాయి, 2017లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు అందుకున్న ఆయన ఈసారి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని.. విధినిర్వహణలో మరింత నిబద్ధతతో పనిచేసేందుకు అవార్డు ఉపకరిస్తుందని తెలిపారు. ఆయనను ఎంఈఓ మోదుగు శ్యాంసన్, హెచ్‌ఎం కె.మార్క్ తదితరులు అభినందించారు.

## శెభాష్ ఫైర్ సిబ్బంది



బురద తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంక్రైం/ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మం సహకారనగర్: నగరంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి అజయ్‌కుమార్ ఆధ్వర్యాన వివిధ ప్రాంతాల సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వరదలో చిక్కుకున్న బాధితులను బయటకు తీసుకురావడంలో పాలుపంచుకున్న వారు ఇప్పుడు బురద, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో స్థానికులకు సహకరిస్తున్నారు. మొత్తంగా 11 వాహనాలతో మొత్తం వంద మందికి పైగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

## 980 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు



చెత్త ఎత్తుతున్న వరంగల్ మున్సిపల్ కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని 14 డివిజన్ల పరిధి 26 కాలనీలు వరద ముంపునకు గురయ్యాయి. ఆయా చోట్ల ఇళ్లు, రహదారులపై మురుగు చేరి బురద పేరుకుపోయింది. దీంతో వరంగల్ కార్పొరేషన్ నుంచి 150 మంది, నల్లగొండ కార్పొరేషన్ నుంచి 50 మంది, పంచాయతీ కార్మికులు 130 మంది, ప్రైవేట్ కార్మికులు 200 మందిని పిలిపించారు. వీరికి తోడు కేఎంసీకి చెందిన 450 మంది కార్మికులను వరద ప్రాంతాల్లోనే పారిశుద్ధ్య పనులకు కేటాయించారు. అలాగే, నీటి సరఫరాకు 51 ట్యాంకర్లు, చెత్త కుప్పలు ఎత్తేందుకు 40 జేసీబీలు, తరలించేందుకు 123 ట్రాక్టర్లు, 43 స్వచ్ఛ ఆటోలను ఏర్పాటు చేశారు.

## రెండోరోజు కూడా ట్రెయినీల సేవలు



సామగ్రి తరలింపులో సహకరిస్తున్న ట్రెయినీ కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం: మున్నేరు వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యల్లో రెండోరోజు కూడా ట్రెయినీ కానిస్టేబుళ్లు పాలుపంచుకున్నారు. ఖమ్మం సీటీసీలో శిక్షణ పొందుతున్న 265 మంది కానిస్టేబుళ్లు, సత్తుపల్లి గంగారం బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న 260 మంది ట్రెయినీలు ముంపు ప్రాంతాల్లో సామగ్రి తొలగింపు, ఇతర పనుల్లో నిమగ్నమయ్యారు. ధంసాలాపురం, శ్రీనివాస్‌నగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్ గృహకల్ప, జలగంనగర్, కవిరాజ్‌నగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో వీరు పనిచేస్తుండగా సీపీ సునీల్‌దత్ పర్యవేక్షించారు.

## ముంపు కాలనీల్లో విషసర్పాలు



బొక్కలగడ్డలోని ఓ ఇంట్లో చనిపోయిన కొండచిలువ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని మున్నేటి వరద బాధితులను విషసర్పాలు కూడా వదలడం లేదు. మున్నేటి పరీవాహకంలో భారీగా వచ్చిన వరదతోపాటు పాములు కొట్టుకొచ్చాయి. వరద ఉధృతి తగ్గాక ఇళ్లకు వెళ్లిన వారికి బురద, చెత్తాచెదారంతో పాటువిషసర్పాలు కనిపిస్తుండటంతో వణికిపోతున్నారు. కొన్ని చనిపోయి, మరికొన్ని బతికి ఉండటంతో ఎటునుంచి ఏ ముప్పు ఉందోనన్న భయంతో పనులు చేసుకుంటున్నారు. బొక్కలగడ్డలోని ఓ ఇంట్లో చనిపోయిన కొండచిలువ కనిపించగా.. పద్మావతినగర్‌లో నాగుపామును స్నేక్ క్యాచర్ బంధించారు.

## 88 కేజీల గంజాయి స్వాధీనం

రఘునాథపాలెం: కారులో తరలిస్తున్న 88 కేజీల గంజాయిని బుధవారం మండలంలోని వీవీ పాలెం వద్ద స్వాధీనం చేసుకున్నట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఆకాష్ మహదేవ్ పవర్, రాహుల్ ఇంగిలే, నారాయణ శాంతారాం చౌదరి ఏపీ రాష్ట్రంలోని అనకాపల్లి నుంచి అదే రాష్ట్రానికి చెందిన షేక్ ఆస్పక్, ఒడిశాకు చెందిన చైనా సహకారంతో 88 కేజీల గంజాయిని రవాణా చేస్తున్నారు. వీవీపాలెం వద్ద చేపట్టిన తనిఖీల్లో గంజాయిని గుర్తించి కారుతో సహా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే, నిందితులపై నార్కోటిక్స్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# పొంగిపొర్లిన బుగ్గవాగు...

- పేరుపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వరద
- ట్రాక్టర్లపై తీసుకొచ్చి పాఠశాలకు తరలింపు





బాధితులను ట్రాక్టర్‌లో తీసుకొస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) స్థానికులను బయటకు తీసుకొస్తున్న ఎస్‌ఐ రాజారాం

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి వద్ద బుగ్గవాగు బుధవారం పొంగిపొర్లింది. ఇల్లెందు అటవీప్రాంతంలో బుధవారం ఉదయం భారీ వర్షం పడటంతో ఒక్కసారిగా బుగ్గవాగు ఉగ్రరూపం దాల్చింది. ఉధృతి క్షణక్షణానికి పెరుగుతూ కారేపలి మండలం పేరుపల్లిలోని డబుల్ బెడ్‌రూం కాలనీని ముంచెత్తింది. దీంతో స్థానికులు మోకాళ్ల లోతు నీళ్లల్లో గగ్గోలు పెట్టారు. ఈ విషయమై అప్రమత్తమైన అధికారులు, స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. పేరుపల్లి – మాధారం మధ్య రాకపోకలు నిలిచిపోగా.. బుగ్గవాగు ఒడ్డుకు ఆనుకుని 20 డబుల్ బెడ్‌రూంలు నిర్మించినా వాగుకు – ఇళ్ల నడుమ రక్షణ గోడ నిర్మించకపోవడంతో ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

**రంగంలోకి ఎస్‌ఐ, తహసీల్దార్**

బుగ్గవాగు ఉధృతి పెరుగుతుందన్న సమాచారంతో అధికారులు డబుల్ బెడ్‌రూం వాసులను అప్రమత్తం చేశారు. ఎస్‌ఐ రాజారాం, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమేశ్, గ్రామ కార్యదర్శి నిరంజన్ స్థానిక యువకుల సహకారంతో వరదలో చిక్కుకున్న 20 కుటుంబాలతోపాటు వారి సామగ్రిని ట్రాక్టర్లు, ట్రాలీల్లో పేరుపల్లి హైస్కూల్‌లోకి తరలించారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు భయంతో ఆర్తనాదాలు చేస్తుండగా ఎస్‌ఐ రాజారాం, యువకులతో కలిసి వారిని బయటకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలియగానే వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ కూడా చేరుకుని స్థానికులకు ధైర్యం చెప్పారు. గత పాలకులు ఇళ్లు – వాగుకు మధ్య రక్షణగోడ నిర్మిస్తామని చెప్పినా పట్టించుకోలేదని వివరించగా.. మంత్రులతో సీఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**నిలిచిన రాకపోకలు**

రఘునాథపాలెం/కామేపల్లి: రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి – వీఆర్‌బంజర మధ్య, కామేపల్లి మండలం పొన్నేకల్ వద్ద బుగ్గవాగుకు భారీగా వరద చేరింది. దీంతో ఖమ్మం – డోర్నకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



నయాబజార్ పాఠశాలలో పేరుకుపోయిన బురద



శుభ్రం చేయిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

## వరద తీసుకొచ్చిన బురద

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొక్కలగడ్డకు ఆనుకుని ఉండటంతో మున్నేటి వరద ఉధృతికి నష్టం ఎదురైంది. పాఠశాలకు ఆనుకుని ప్రహరీ కూలడంతో ఆవరణలోకి వరద చేరి కంప్యూటర్లు, బెంచీలు, రికార్డులు, ల్యాబ్‌లోని సామగ్రి తడిసి ముద్దయ్యాయి. సుమారు 80 బెంచీలు, కార్యాలయ రికార్డులు, రిజిస్టర్లు, పుస్తకాలు, ల్యాబ్‌ల సామగ్రి, ఎనిమిది కంప్యూటర్లు, రెండు మోటార్లు ఇతరత్రా అన్నీ పాడైపోవడంతో రూ.30 లక్షలకు పైగానే నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. బుధవారం రెండు ఫైరింజన్ల ద్వారా పాఠశాలలో పేరుకుపోయిన బురదను సిబ్బందితో తీయించగా హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు సైతం పనుల్లో పాలుపంచుకున్నారు.

## బాధితులకు తర్వాత.. మనకే ముందు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు సిబ్బంది తీరు విమర్శలకు తావిస్తోంది. మున్నేరు వరద బాధితుల కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన సామగ్రి కిట్లను ఎన్నికల విభాగం సిబ్బంది కొందరు తీసుకున్నారు. ఈ కిట్లను అధికారులకు తెలియకుండా తమ గదిలో పెట్టుకున్నారు. బాధితులకు అందాల్సిన కిట్లను సిబ్బంది తీసుకోవడంపై పలువురు తప్పుపడుతున్నారు.

# జిల్లాలో పర్యటించిన డీహెచ్

ఆస్పత్రులు, ముంపు ప్రాంతాల్లో పరిస్థితులపై ఆరా



ఖమ్మంలో వైద్యశిబిరం వద్ద మాట్లాడుతున్న డీహెచ్ రవీంద్రనాయక్

ఖమ్మంవైద్యవిభాగం/తల్లాడ: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు (డీహెచ్) ఈ.రవీంద్రనాయక్ బుధవారం జిల్లాలో పర్యటించారు. తొలుత తల్లాడ పీహెచ్‌సీలో తనిఖీ చేసిన ఆయన ఫార్మసీ, ల్యాబ్‌ను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. వైద్యాధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఖమ్మంలో వరద ముంపునకు గురైన మంచికంటి నగర్, తదితర ఏరియాల్లో పర్యటించిన డీహెచ్ అక్కడి వైద్యశిబిరాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలిచ్చారు. ముంపు ప్రాంతాల్లో దోమలు పెరగకుండా ఫాగింగ్, యాంటీ వైరల్ ఆపరేషన్ చేపట్టాలన్నారు. అలాగే, ఇంటింటి జ్వర సర్వేపై సూచనలు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, సీతారామ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రామారావు, వెంకటరమణ, చందునాయక్, తల్లాడ వైద్యాధికారి ఐ.రత్నమనోహర్, ఉద్యోగులు పెద్ద పుల్లయ్య, భాస్కర్, భద్రమ్మ, కళావతి, రాజ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, రాజశ్రీ, భద్రమ్మ, సురేశ్, సంజయ్ పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసహకారనగర్: మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన సంకల్ప దీక్షగా చేపట్టామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలోని మున్నేరు వరద పరీవాహక ప్రాంతాలైన బొక్కలగడ్డ, మంచికంటినగర్, పద్మావతినగర్, కరుణగిరి, సాయిప్రభాత్‌నగర్, రాజీవ్ గృహకల్ప, దివ్యాంగుల కాలనీల్లో పనులు, వైద్యశిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పలువురి ఇళ్లకు వెళ్లి వరద నష్టంపై ఆరా తీసి ఓదార్చారు. ఊహించని రీతిలో వచ్చిన వరదతో ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉన్నా.. వేర్వేరుగా కుటుంబాల ఆధారంగానే పరిహారం అందుతుందని, ఈ విషయంలో అపోహలు నమ్మొద్దని సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు.

# యూహెచ్‌సీలో పాడైన మందులు, సామగ్రి



బయట పెట్టిన బ్యాంకు ఫైళ్లు, సామగ్రి

ఖమ్మంవైద్యవిభాగం: మున్నేరు వరద ఖమ్మంలోని వెంకటేశ్వరనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను కూడా వదల్లేదు. వరద ప్రభావంతో సెంటర్ పూర్తిగా మునగగా.. మందులు, ఇతర సామగ్రి పనికి రాకుండా పోయాయి. చిన్నారులకు వినియోగించే వ్యాక్సిన్లు, ఫ్రిజ్‌ల ఆనవాళ్లు కోల్పోయాయి. సారథినగర్‌లో ఉండే ఈ యూహెచ్‌సీ పూర్తిగా నీట మునగడంతో రెండు రోజుల పాటు వెళ్లేందుకు వీలు కాలేదు. చివరకు వరద తగ్గాక వెళ్లేసరికి మందులు, సామగ్రి పనికి రాకుండా పోవడంతో బయటపడేసి మంగళవారం, బుధవారం శ్రమిస్తే సెంటర్ రూపురేఖలు బయటపడ్డాయి.

**తడిసిన బ్యాంక్ హార్డ్‌డిస్క్‌లు, ఫైళ్లు**

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంరూరల్ మండలం నాయుడుపేట సమీపాన ఉన్న ఓ బ్యాంకులోకి మున్నేరు వరద చేరడమే కాక బురద మేటలు వేసింది. దీంతో సిబ్బంది బుధవారం ఉదయాన్నే శుభ్రం చేసే పనిలో పడ్డారు. కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, ఇతర సామగ్రితో పాటు ఫైళ్లు తడిచిపోవడంతో మేనేజర్‌తో సహా సిబ్బంది ఒక్కొక్కటి బయట పెట్టి శుభ్రం చేయడం కనిపించింది. అయితే, వరద చేరడంతో నగదు ఏమైనా కొట్టుకుపోయిందా అని ఆరా తీయగా సమాచారం చెప్పలేదు. అంతేకాక ఫొటోలు తీసేందుకు కూడా ససేమిరా అనడం గమనార్హం.

# నష్టం అంచనాలపై అదనపు కలెక్టర్ పరిశీలన



వరదతో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

తిరుమలాయపాలెం: ఆకేరు వరదలతో మండలంలోని రాకాసితండా తుడిచిపెట్టుకుపోగా జరిగిన నష్టంపై ఉద్యోగులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ బుధవారం గ్రామంలో నాలుగు గంటల పాటు ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీశారు. ఇళ్లలో ధాన్యం, బియ్యం తడిసిపోవడంతో పాటు ఇంట్లో ఉన్న నగదు, మేకలు, పశువులను కోల్పోయామని బాధితులు వివరించారు. అలాగే, గ్రామంలో విద్యుత్, తాగునీటి సరఫరాకు జరుగుతున్న ఏర్పాట్లను ఆయన తెలుసుకున్నారు. కాగా, తండావాసులు జల్లెపల్లి పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటూనే ఇళ్లకు వచ్చి శుభ్రం చేసుకుని వెళ్తున్నారు. ఇక మండలంలోని బీరోలు పెద్ద చెరువు తెగిపోయి కల్వర్టు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయిన బంధంపల్లి గ్రామంలో పరిస్థితులను అదనపు కలెక్టర్ మధుసూదన్ పరిశీలించారు. తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనూషతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏకాగ్రతతో చదివితే ఐఐటీ, మెడిసిన్‌లో సీట్లు

రఘునాథపాలెం గిరిజన గురుకులంలో ఐటీడీఏ పీఓ రాహుల్

రఘునాథపాలెం: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఐఐటీలు, మెడికల్ కాలేజీల్లో సీట్లు లభిస్తాయని.. తద్వారా చదివిన పాఠశాల, జన్మనిచ్చిన ఊరు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావొచ్చని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రఘునాథపాలెంలోని గిరిజన సంక్షేమ గురుకులం ద్వారా నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలను మంగళవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, డార్మిటరీ, పరిసరాలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించాక బోధన తీరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడగా కొన్ని పాఠాలు సరిగ్గా అర్థం కావడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందడం లేదని తెలిపారు. ఈమేరకు పీఓ మాట్లాడుతూ.. సీనియర్ ఫ్యాకల్టీని నియమించడంతో పాటు మెనూ తప్పక అమలుచేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అలాగే, వర్షాల నేపథ్యాన విద్యార్థులు వాగుల వైపు వెళ్లకుండా పర్యవేక్షించాలన్నారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, ప్రిన్సిపాల్ బాలస్వామి, సింగరేణి కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, ఏటీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

తిరుమలాయపాలెం: ఆకేరు వరదతో తీవ్రంగా నష్టపోయిన మండలంలోని రాకాసితండాను జిల్లా ప్రత్యేకాధికారి, సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం పరిశీలించారు. వరదతో నష్టపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో వేగం పెంచేలా ఇతర జీపీల నుంచి సిబ్బందిని రప్పించాలని, తాగునీటి సరఫరాకు బోర్ వేయించాలని తెలిపారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

**అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు**

మధిర: ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరచాలని సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మధిర మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన ముంపు ప్రాంతాల్లో సమస్యలు, పునరుద్ధరణ పనులపై సమీక్షించారు. డ్రెయినేజీల పనులు, రోడ్ల తాత్కాలిక మరమ్మతులు, బాధితుల వివరాలను సేకరించాలని సూచించారు. వరంగల్ ఆర్‌డీడీ షాహీద్ మసూద్, మధిర కమిషనర్ షఫీఉల్లా, చైర్ పర్సన్ ఎం.లత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన అదనపు కలెక్టర్ శ్రీజ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న శ్రీజ

ఖమ్మంసహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పి.శ్రీజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పర్యటించడమే కాక మంత్రుల సమీక్షల్లోనూ ఆమె పాల్గొన్నారు.

## తెగిన రహదారి గుంతలో పడిన ఇద్దరు

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు పెట్రోల్ బంక్ వద్ద రహదారి గుంతలో పడి ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం గ్రామానికి చెందిన సాయికుమార్, నీరుడి గోవర్ధన్ బైక్‌పై మరిపెడ బంగ్లా వెళ్లి, తిరిగి సుబ్లేడు మీదుగా వస్తున్నారు. సుబ్లేడు పెట్రోల్‌బంక్ సమీపంలోని గుంతలో పడి ఇద్దరూ గాయపడగా సాయికుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రహదారి తెగిపోయిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని క్షతగాత్రుల బంధువులు ఆరోపిస్తున్నారు.

## సత్తుపల్లి దొంగ హైదరాబాద్‌లో అరెస్ట్

- 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సత్తుపల్లిటౌన్: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న సత్తుపల్లి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తిని హైదరాబాద్ క్రైం బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 20బైక్‌లు చోరీ చేసి సత్తుపల్లి ప్రాంతంలో విక్రయించాడు. అక్కడ సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించి, కొనుగోలు చేసిన వారి నుంచి బైక్‌లు రికవరీ చేశారు. కాగా, సరైన పత్రాలు లేకుండా వాహనాలు కొనుగోలు చేసే వారిపైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు..

ఖమ్మంలీగల్: భూమి విషయమై మోసం చేశాడనే కారణంతో ఖమ్మానికి చెందిన సంఘబత్తుల శ్రీనివాసరెడ్డికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కోయచలకకు చెందిన చెరుకూరి రామయ్య 2005 మే 2న నిందితుడైన శ్రీనివాసరెడ్డి నుంచి ప్లాట్ కొనుగోలు చేశాడు. అయితే, అప్పటికే ఆ ప్లాట్‌ను ఇంకో వ్యక్తికి అమ్మి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీంతో రామయ్య కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈ మేరకు కోర్టు ఆదేశాలతో ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో శ్రీనివాసరెడ్డిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రాజారావు వాదించగా, కానిస్టేబుల్ రామకృష్ణ సహకరించారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడు చెరువులో చేపల వేటకు వెళ్లి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలేశ్వర్ (40) బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా బాలేశ్వర్ తల్లంపాడులో పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన సన్నిహితులతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు.

## విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్...

ఖమ్మంరూరల్: మోటార్ మరమ్మతు చేసేందుకు వచ్చిన ఓ ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఆర్టీసీ కాలనీవాసి పుల్లయ్యకు చెందిన మోటార్ దెబ్బతినడంతో ఖానాపురం హవేలీకి చెందిన ఎలక్ట్రీషియన్ డి.సత్యనారాయణ (50)ను పిలిపించారు. ఆయన పనిచేస్తుండగా షాక్‌తో అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

## మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

తల్లాడ: మద్యం సేవించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని భార్య చెప్పడంతో క్షణికావేశానికి గురైన వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన ఎర్రి స్వామి ఈనెల 1వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య విజయలక్ష్మి ఆరోగ్యం దెబ్బతింటున్నందున ఇక నుంచి తాగొద్దని సూచించింది. దీంతో ఆయన క్షణికావేశంలో పురుగులమందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఆస్పత్రిలోనే మృతి చెందాడు. ఘటనపై స్వామి కుమారుడు రాకేశ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.